క్లుప్తంగా

రేపటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ

పుత్తూరు రూరల్: స్థానిక పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 17 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్, పీఆర్ఓ ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ అయిన వారు, 2023 ఏడాది 10వ తరగతి పరీక్ష రాసిన వారు అర్హులని తెలిపారు. ఉచిత శిక్షణ పొందదలిచిన వారు పదో తరగతి మార్క్స్ లిస్టు జిరాక్స్, హాల్ టికెట్ జిరాక్స్ తీసుకురావాలని చెప్పారు. మే 5వ తేదీ వరకు నిర్వహించే తరగతులు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడతాయని తెలిపారు. వివరాలకు 90102 22155 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

తొలిరోజే విద్యాకానుక పంపిణీ



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలరాజు

పుత్తూరు రూరల్: జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభ రోజునే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక అందాలని ఎంఈఓ తిరుమలరాజు స్పష్టం చేశారు. శనివారం సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు, ఎంఐఎస్ డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న విద్యాకానుక విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థికి విద్యాకానుక కిట్ ద్వారా బ్యాగు, బెల్టు, షూస్, డిక్షనరీ, పాఠ్యపుస్తకాలు, నోట్స్ అందజేయాల్సి ఉంటుందన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్‌గా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఇక్కడ నుంచి మండలంలోని ప్రతి స్కూల్‌కు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏపీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్త మృతదేహానికి నివాళులు



సుధీర్‌రాజు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాంప్రసాద్ రెడ్డి

వడమాలపేట: మండల పరిధిలోని ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన సుధీర్‌రాజు కిడ్నీ సమస్యతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చుతూ పార్టీ అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సురేష్‌కుమార్, నాయకులు వెంకట్రామరాజు, బాబు, తిమ్మయ్య, సుదర్శన రాజు, నరసింహులురాజు, చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మురగారెడ్డి

పుత్తూరు రూరల్: అన్ని కార్మిక సంఘాలు కలిసి మే డేను విజయవంతం చేయాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక షేర్ ఆటో వర్కర్స్ హెల్ప్‌లైన్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురగారెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకు వస్తోందని ఆరోపించారు. అన్నిసంఘాలు సంఘటితంగా కలిసి కేంద్రప్రభుత్వ విధానాలపై పోరాడాలని కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో దుప్పి మృతి



కార్వేటినగరం: కుక్కల దాడిలో దుప్పి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కేశవకుప్పం ఎస్టీకాలనీ సమీపంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా.. కేశవకుప్పం ఎస్టీకాలనీ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం ఎస్టీ కాలనీ వైపు వచ్చిన ఓ దుప్పిని గ్రామంలోని కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో మృతి చెందినట్లు తెలిపారు. దీంతో స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కుక్కలదాడిలో గాయపడిన దుప్పిని ప్రభుత్వ పశువైద్యులు నాగభూషణం పోస్టుమార్టం చేయగా, కుప్పానికుంట ప్రాంతంలో దుప్పి మృతదేహాన్ని ఖననం చేశామన్నారు. వేసవి నిమిత్తం తాగునీటి కోసం గ్రామాల వైపు వచ్చిన దుప్పిలను కుక్కలు వెంటాడకుండా స్థానికులు రక్షణ కల్పించాలని సూచించారు. ఎఫ్ఆర్ఓ వెంట బీట్ అధికారులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో 'వ్యవస్థాపక' వెలుగులు

విద్యార్థులను భావిపారిశ్రామికవేత్తలుగా మలిచేందుకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటి నుంచే సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లలో 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తద్వారా విద్యార్థులతో స్కూల్లో రెగ్యులర్ చదువుతో పాటు పారిశ్రామిక విధానంపై శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా బొమ్మల తయారీ, వస్తువుల తయారీపై తర్ఫీదు ఇచ్చి భావి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోంది.

- అన్ని ప్రభుత్వ స్కూళ్లలో 'వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి' కార్యక్రమం
- పాఠశాల విద్య నుంచే పారిశ్రామిక విజ్ఞానానికి పునాదులు
- వస్తువుల తయారీలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం



తయారుచేసిన కృత్యాలను ఉపాధ్యాయుల ముందు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నగరి: రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వ్యవస్థాపక విద్యను అవసరంగా గుర్తించి పాఠ్యాంశాల్లో భాగంగా ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. విద్యార్థులు స్థిరమైన భవిష్యత్ కోసం, పారిశ్రామికపరమైన ప్రావీణ్యం పొందేందుకు వ్యవస్థాపక విద్యాబోధన ప్రధాన అంశంగా కనిపిస్తోంది. గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సంస్థతో అనుసంధానమై లాభాపేక్ష లేని సంస్థలైన ఉద్యామ్ లర్నింగ్ ఫౌండేషన్, రీప్ బెనిఫిట్, మేకర్ ఘాట్, అఫ్లాటన్ ఇంటర్నేషనల్ సంస్థల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం రూపొందించబడింది. రాష్ట్ర విద్యాశాఖ వ్యవస్థాపక మనస్తత్వ కార్యక్రమాన్ని మొదటి దశలో ఆన్‌లైన్‌లో 2021వ సంవత్సరం జూలై 20వ తేదీన ప్రారంభించగా, రెండవ దశను 2021వ సంవత్సరం, నవంబర్ 20న 377 పాఠశాలల్లో గేమ్ కూటమి, సమగ్రశిక్ష, ఎస్‌సీఈఆర్టీల సహకారంతో 32 గంటల పాఠ్య ప్రణాళికతో వ్యవస్థాపక విద్యను ప్రారంభించారు. ప్రతి జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయుల వంతున మొత్తం 52 మంది ఉపాధ్యాయులు మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ పొంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. 3వ దశలో 2022–23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని 6300కు పైగా పాఠశాలల్లో అమలు చేయబడుతోంది. 6 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతారు. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం 9వ తరగతి పాఠ్య ప్రణాళిక, టైంటేబుల్‌లో చేర్చబడింది. ఉన్నత పాఠశాలల్లో ప్రతి శుక్రవారం



విద్యార్థులకు బొమ్మల తయారీపై శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతోంది.

రాష్ట్రవ్యాప్తంగా 12 వేల మంది..

రాష్ట్రవ్యాప్తంగా పన్నెండు వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి శిక్షణ పొందారు. ప్రస్తుతం అన్ని స్కూళ్లలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 41 ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యను బోధిస్తున్నారు. విజయపురం మండలం గంగమాంబాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అకడమిక్ విద్యతో పాటు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమాన్ని అత్యున్నతంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులను రేపటి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి పాఠశాల స్థాయిలోనే పునాదులు వేస్తున్నారు. ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీరమంగళం వెంకటరమణ వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం శిక్షణ తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను పారిశ్రామికరంగం వైపుకు అడుగులు వేయిస్తున్నారు. చిన్నచిన్న వస్తువుల తయారీతోనే భారీ పరిశ్రమలకు పునాదులు వేయవచ్చని విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల వైపు ఎదురు చూడకుండా తమ సొంత ఆలోచనలతో ఎదగడానికి తమవంతు కృషి చేస్తున్నారు.

ప్రగతికి దోహదపడుతుంది..



వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. చిన్నపిల్లల ఆట వస్తువులకు బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. ఆన్‌లైన్ సంస్థలు కూడా చిన్న పిల్లలు ఆడుకునే ఆట వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నాయి. వస్తువుల తయారీపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవడం భవిష్యత్‌లో వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి తోడ్పడుతుంది. హెచ్ఎంలు గోవిందస్వామి రెడ్డి సహకారంతో వస్తువుల తయారీలో అత్యున్నత శిక్షణ అందిస్తున్నాం. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా పనిచేస్తున్నాం.

–వెంకటరమణ, ఇంగ్లిష్ టీచర్, గంగమాంబాపురం

వేడుకగా ప్రసన్న వెంకన్న కల్యాణోత్సవం



వడమాలపేట : టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఆర్జిత కల్యాణోత్సవాన్ని శనివారం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రం సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, శాత్తుమొర, మొదటిగంట, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని పట్టుపీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోమం నిర్వహించారు. భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వేదమంత్రాలతో మాంగల్యధారణ చేయించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఘనంగా ఊంజల్‌సేవ నిర్వహించారు.

వేడుకగా గ్రామోత్సవం..

సర్వఅలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు నడుమ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. భక్తుల నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసి స్వామివారికి మంగళ హారతులిచ్చారు. అనంతరం భక్తులు సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, షారాబు రామకృష్ణ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

- అలరించిన ఫల, పుష్పాలంకరణ

నగరి : పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం విషు పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టిన ఫల, పుష్పాలంకరణ పలువురిని అలరించాయి. భక్తుల కోసం ఆలయం బయట చలువ పందిళ్లు వేశారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో అయ్యప్ప భజనలు ప్రారంభమయ్యాయి. ఆలయం ఆవరణ అంతా అయ్యప్ప భక్తులతో నిండిపోయింది. పుష్పాలంకరణలో సుందరంగా కనిపించిన అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపారు. పద్దెనిమిది పడికట్లపై వెలిగించిన కర్పూర దీపాలను దర్శించుకుని మొక్కుకున్నారు. పుష్పార్చన పూజకు వాడిన పుష్పాలను, తులసిని



ఫల, పుష్పాలంకరణలో ఉన్న అయ్యప్పస్వామి

మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రతి సంవత్సరం శబరికొండ యాత్రకు వెళ్లడానికి రెండు రోజుల ముందు ఇలాంటి ఉత్సవాలు చేస్తామని అయ్యప్ప భక్తులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పరిపాలనకు ప్రజల అండ



కేవీపీఆర్ పేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి : 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తాను ప్రత్యక్షంగా గమనించానని, గతంలో జరిగిన అన్ని కార్యక్రమాల కన్నా ఇది చాలా ప్రతిష్టాత్మకమైందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కేవీపీఆర్ పేటలో ఆయన జగనన్నే మా భవిష్యత్–మా నమ్మం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గృహయజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ కౌన్సిలర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు బాధ్యతగా తీసుకుని ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ గంగాధరం, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపేటలో కౌన్సిలర్ మోహన్‌రాజ్, కామాక్షి ఆధ్వర్యంలో, 12వ వార్డులో భూపాలన్, చిత్ర, కామాక్షి ఆధ్వర్యంలో గృహసారథులు, పార్టీనాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అభిప్రాయ సేకరణ చేసి స్టిక్కర్లు అతికించారు. పార్టీ నాయకులు ఇలంగో, సతీష్, బీకే రమేష్, రమేష్‌బాబు, అరుళ్, సత్యరాజ్, జేజే బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని పచ్చికాపల్లంపేట, కోణంగిపల్లె, గొల్లపల్లె గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతూ వారి అభిప్రాయాలను నమోదు చేశారు. అనంతరం వారి ఫోన్ నుంచి ప్రభుత్వం కేటాయించిన నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చారు. సచివాలయ కన్వీనర్ సుమతి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న చిన్నమరెడ్డి

జగనన్నతో పేదలకు భరోసా

గంగాధరనెల్లూరు: మండలంలోని మహదేవమంగళం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం సర్పంచ్ ఉమ ఆధ్వర్యంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశించిన 5 ప్రశ్నలకు జవాబులు రాబట్టారు. వైస్ ఎంపీపీ హరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్, నాయకులు సురేంద్రరెడ్డి, రమేష్, జయరామరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా

శ్రీరంగరాజపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని పుల్లూరు ఎంపీటీసీ సభ్యులు చంద్రశేఖర్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పుల్లూరు, కమ్మకండ్రిగ, మిట్టహరిజనవాడలో నిర్వహించారు. లబ్ధిదారులు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. సర్పంచ్ బాబు, నాయకులు యోగానందం, ఏసునాథం, ప్రమీల, హరిరెడ్డి, గుర్రప్ప, వెంకటేష్, నేతాజీ పాల్గొన్నారు.

అజాగ్రత్తే అగ్నిప్రమాదాలకు కారణం



రైల్వేస్టేషన్‌లో కరపత్రాలు పంచుతున్న ఫైర్ సిబ్బంది

నగరి : అజాగ్రత్తే అగ్నిప్రమాదానికి దారి తీస్తుందని ఫైర్ ఆఫీసర్ మస్తాన్ అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రైల్వేస్టేషన్, బస్టాండు ప్రాంగణంలోని ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన వంటింటిలో అగ్నిప్రమాదాలకు దారి తీసే అంశాలు, విద్యుత్ సంబంధిత అజాగ్రత్తల వల్ల ఏర్పడే అగ్నిప్రమాదాలు, స్కూళ్ళ, ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు, గోదాములు, కర్మాగారాలు, గ్రామీణ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలకు దారితీసే అంశాల గురించి అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ నేతాజీ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో సిబ్బందితో కలిసి అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పుత్తూరు అగ్నిమాపక కేంద్ర పరిధిలో గత 2022–23 ఏడాదిలో 58 అగ్ని ప్రమాదాలు జరగ్గా రూ.63.92 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదాల్లో ఐదుగురి ప్రాణాలను కాపడగా దురదృష్టవశాత్తు ఒకరు మృతి చెందినట్లు చెప్పారు. రూ.1.28 లక్షల ఆస్తిని కాపాడినట్లు వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఇంట్లో, ప్రతి షాపు, ఫ్యాక్టరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నియంత్రణ పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దుస్తులకు నిప్పు అంటుకుంటే భయపడి పరిగెత్తుకుండా, నేలపై దొర్లుతూ, దుప్పటి వంటి గట్టి వస్త్రాన్ని కప్పాలని సూచించారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు



ఊరేగింపుగా వస్తున్న సీతారామలక్ష్మణులు

నగరి : పట్టణ పరిధిలోని పాతభజన గుడి వీధిలో ఉన్న కోదండరామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతారామ లక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహనంపై ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

'మిషన్ వాత్సల్య'కు దరఖాస్తుల వెల్లువ



మిషన్ వాత్సల్య పథకం దరఖాస్తులను తీసుకుంటున్న మహిళా పోలీస్

పాలసముద్రం : విధి వంచితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం చేపట్టిన మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తులు వెల్లువలా వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి శంఖర్, వీఆర్ఓ రమణయ్య తెలిపారు. శనివారం కృష్ణజమ్మపురం సచివాలయంలో మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేయడానికి వచ్చిన వారితో పంచాయతీ కార్యదర్శి శంకర్ మాట్లాడారు. తల్లి లేక తండ్రి కోల్పోయిన పిల్లలకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలన్నే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయని చెప్పారు. ఈ పథకానికి ఈనెల 15వ తేదీ చివరిరోజు కావడంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సచివాలయ మహిళా పోలీస్ వద్ద ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మహిళా పోలీస్ మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యకు మించిన సంపద లేదు



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ నరసింహులు

కార్వేటినగరం: ప్రపంచంలో విద్యకు మించిన సంపద లేదని, విద్యను అందిపుచ్చుకున్నవారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ నరసింహులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాదని, కష్టపడి చదివిన వారు రాణించడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు స్కూళ్లలో కూడా నిరుపేదలకు ఉచితవిద్యను అందించడానికి ముందుకొచ్చిందని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని గొప్ప విద్యావంతులుగా రాణించాలన్నారు. అనంతరం పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



వ్యవసాయం పొలంలో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

నగరి (విజయపురం) : మండలంలోని ఇల్లత్తూరులో శనివారం ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఇల్లత్తూరు సరిహద్దు ప్రాంతాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని వాపోయారు. ఫలితంగా విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు టేబుల్, స్టార్టర్లు కూడా తీసుకెళ్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా రు.

అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



చిన్నారుల కోసం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మోహన్‌కృష్ణ

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని పాలసముద్రం, సన్నగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. పిల్లలు భోజనం తినకముందే ఉడికిన గుడ్డు ఇవ్వాలని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం చిన్నారుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, రాధ, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు



పరీక్షకేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ సురేష్, మహిళ పోలీసులు

పాలసముద్రం : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ రాజేంద్రప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్ శరవణ రెడ్డి తెలిపారు. శనివారం వారు పరీక్షలు ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మండలంలోని బలిజకండ్రిగ, తిరుమలరాజుపురం, వెంగళరాజుకుప్పం, అరుణోదయ ఇంగ్లిష్ మీడియం, పాలసముద్రం హైస్కూల్‌లో 189 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో బాలురు 109, బాలికలు 80 ఈ నెల 3 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ సురేష్ పరీక్ష కేంద్రంలో గట్టి బందోబస్తు ఇచ్చాడు.

మాజీ ఎంపీపీ గోవిందస్వామి మృతి



గోవిందస్వామి (ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు మండల పరిషత్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఏ.గోవిందస్వామి(84) శనివారం మృతి చెందారు. పుత్తూరు మండలం వేపగుంట గ్రామానికి చెందిన ఈయన 2009 నుంచి 2014 వరకు ఎంపీపీగా పనిచేశారు. అంతకుముందు రైల్వేస్టేషన్ మాస్టర్‌గా పని చేసి పదవీ విరమణ పొందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఈయన శనివారం కన్నుమూశారు. ఆదివారం వేపగుంటలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

జంబాడ రోడ్డుకు మోక్షం



జంబాడ రోడ్డు పనులు

నగరి (విజయపురం) : ఎట్టకేలకు జంబాడ రోడ్డుకు మోక్షం కలిగింది. విజయపురం నుంచి పాతర్కాడు మీదుగా కనకమ్మ సత్రం వెళ్లే రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా రోడ్డు దుస్థితిలో ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.